క్లుప్తంగా

శేష వాహనంపై శ్రీనివాసుడు



శేషవాహనంపై శ్రీవారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని శేష వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ధ్వజారోహణం, మహాకుంభ ఆరాధన, చతుస్థానార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోట పోలేరమ్మ జాతర



కోట పోలేరమ్మ జాతరలో బోనాలతో మహిళలు

పోరుమామిళ్ల : మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ పెద్ద కప్పలపల్లెలో ఆదివారం కోట పోలేరమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు బోనాలు తలపై పెట్టుకుని, వేపమండలతో ఊరేగింపుగా బయలుదేరారు. తప్పెట్ల మోతలు, చిందులు ఊరేగింపులో కనువిందు చేశాయి. మొక్కుబడులున్నవారు మేకపోతులు, కోడిపుంజులతో పోలేరమ్మ గుడికి చేరుకున్నారు. గుడి వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించి, ఈ సంవత్సరం వానలు సమృద్ధిగా కురవాలని పోలేరమ్మను వేడుకున్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



బిషప్ దంపతులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని పాలెంలో సీఎస్ఐ చర్చి మూడవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో ముఖ్య అతిథిగా సీఎస్ఐ డయాసిస్ బిషప్ డాక్టర్ ఐజక్ వరప్రసాద్, భారతమ్మ దంపతులు పాల్గొన్నారు. వారిని శాంతినగర్ సీఎస్ఐ చర్చి పాస్టర్ వినయ్ బాబు, పాలెం చర్చి సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. చర్చి వార్షికోత్సవం సందర్భంగా కోలాటాలు, చెక్క భజన ఊరేగింపుతోపాటు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రాయలసీమ డయాసిస్ గురువులు, సభ్యులు పాల్గొన్నారు.

భారత క్రికెట్ జట్టుకు ఆదిత్యరెడ్డి అభినందనలు



పోరుమామిళ్ల : టీ–20 వరల్డ్‌కప్‌లో 27 సంవత్సరాల తర్వాత అద్వితీయ విజయం సాధించిన భారత జట్టుకు వైఎస్సార్‌సీపీ యువనేత ఆదిత్యారెడ్డి అభినందనలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టోర్నీ ఆద్యంతం సమష్టి కృషితో భారత జట్టు విజయం సాధించిందన్నారు. కెప్టెన్ రోహిత్ తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు.

రోటరీ సేవలు విస్తృతం చేస్తాం

రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ డాక్టర్ సాధు గోపాలకృష్ణ



మాట్లాడుతున్న రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ డాక్టర్ సాధు గోపాలకృష్ణ

ప్రొద్దుటూరు కల్చరల్ : రోటరీ సేవలను విస్తృతం చేస్తామని రోటరీ డిస్ట్రిక్ట్ 3160 నూతన గవర్నర్ డాక్టర్ సాధు గోపాలకృష్ణ పేర్కొన్నారు. పెన్నానదీ తీరంలోని రెడ్ల కల్యాణ మండపంలో ఆదివారం రోటరీ డిస్ట్రిక్ట్ 3160 నూతన గవర్నర్, అసిస్టెంట్ గవర్నర్లతో వరల్డ్ మాజీ రోట్రాక్ట్ చైర్ రవి వడ్లమాని ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సమాజ సేవలో ముందంజలో ఉందన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో 529 రోటరీ జిల్లాల్లో 37వేల క్లబ్‌లు ఉన్నాయన్నారు. 14 లక్షల సభ్యులతో సేవా కార్యక్రమాలను రోటరీ క్లబ్ నిర్వహిస్తోందన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3160 ఆధ్వర్యంలో 90 క్లబ్‌లు ఉన్నాయన్నారు. పోలియో నిర్మూలనకు రోటరీ సంస్థ రూ.400 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రోటరీ క్లబ్‌కు జీకే సాధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20.75 లక్షలు అందించినట్లు తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్లుగా మల్లికార్జునతోపాటు 12 మంది, రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడిగా బాల సూర్యారావు, కార్యదర్శిగా శ్రీధర్ శర్మ, మిడ్‌టౌన్ రోటరీ అధ్యక్షుడిగా తుకారం, కార్యదర్శిగా రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మాజీ గవర్నర్లు మణిక్ పవర్, వేమన సతీష్, ప్రభు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, మాజీ కార్యదర్శి గజ్జల వెంకటేష్ రెడ్డి, తాండవకృష్ణ, జాకీర్ అహ్మద్, కేటీరెడ్డి, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ మీడియా చైర్మన్ అయూబ్‌ఖాన్, రొటేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

మండల ఇంజనీరు ఈశ్వరయ్య సేవలు ప్రశంసనీయం



సతీసమేతంగా ఈశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కుళ్లాయప్ప దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు : పంచాయతీ రాజ్ శాఖలో మండల ఇంజినీరుగా ఈశ్వరయ్య విధి నిర్వహణలో అందించిన సేవలు ప్రశంసనీయమైనవని పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండల ఇంజినీరుగా పని చేస్తున్న శనివారపు ఈశ్వరయ్య ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవనంలో పదవీ విరమణ సన్మాన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఈశ్వరయ్య విధి నిర్వహణలో ఎంతో కచ్చితత్వంతో ఉంటూ కింది స్థాయి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ తనవంతుగా స్ఫూర్తిదాయకంగా పని చేసేవారన్నారు. మండల అధ్యక్షుడు టి.లక్షుమయ్య మాట్లాడారు. అనంతరం ఈశ్వరయ్యను సతీసమేతంగా ఉద్యోగులు, విశ్రాంత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రహంతుల్లా, ఇతర మండలాల ఎంపీడీఓలు శ్రీధర్‌నాయుడు, జగదీశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మాజీ ఎంపీపీ మధు సూదన్‌రెడ్డి, చల్లబసాయపల్లె మంజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లాయప్ప సేవలు అభినందనీయం

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుడుగా, సంఘ నాయకుడుగా కుళ్లాయప్ప అందించిన సేవలు అభినందనీయమని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని క్రిష్ణంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తూ పదవీ విరమణ చేసిన కుళ్లాయప్పను సతీసమేతంగా ఆదివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నాలుగు మండలాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నిర్మల, రఘురామిరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, బాల గంగిరెడ్డి, రషీద్‌ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా , మండల నాయకులు పాల్గొన్నారు.

ఎన్జీఓ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు

మైదుకూరు : పట్టణంలోని మైదుకూరు తాలూకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ భవన నిర్మాణం కోసం కృషి చేయాలని అసోసియేషన్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య, కోశాధికారి లక్కినేని బాబు, తాలూకా కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైదుకూరు తాలూకాలో అసోసియేషన్‌కు భవనం లేదని, వెంటనే స్థలం ఏర్పాటు చేసి భవన నిర్మాణానికి సహకరించాలని అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. దానిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్, సెక్రటరీ డి.రవికుమార్, కోశాధికారి నిత్యపూజయ్య, సహ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు బాల పుల్లయ్య, పద్మనాభం, శ్రీనివాసులు, మైదుకూరు తాలూకా ఉపాధ్యక్షుడు పెంచల్ రెడ్డి, ప్రభాకర్, రాజన్న, సంయుక్త కార్యదర్శి రామగుప్తా తదితరులు పాల్గొన్నారు.

చివరి వరకు నిజాయితీగా జీవిస్తా

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు : జీవితాంతం నీతి, నిజాయితీతో జీవించి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాపాడుతానని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం విశ్వ హిందూ పరిషత్, వివేకానంద సేవా సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు అన్ని జన్మల్లోకల్లా ఉత్తమమైన జన్మను మనకు ఇచ్చారన్నారు. చివరి దశ వరకు నీతి నిజాయితీతోనే వ్యవహరిస్తానని, ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పోలీసు ఎస్కార్ట్ కూడా తాను వెనక్కి పంపానని, కేవలం సాధారణ జీవితాన్ని మాత్రమే గడపాలని నిశ్చయించుకున్నానన్నారు. తన హయాంలో పలు ఆలయాల భూముల వేలం పాటలు నిర్వహించి ఆలయాల అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. గాంధీ రోడ్డు, శివాలయం వీధి, శ్రీరాములపేట, హోమస్‌పేట రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కొర్రపాడు రోడ్డును కూడా కొంత వరకు విస్తరించామని, కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో మధ్యలో ఆగిపోయిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీనరసయ్య, విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి, మారెళ్ల మల్లికార్జునరావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్రరావు, నాయకులు గొర్రె శ్రీనివాసులు, దస్తగిరి, పట్టణ వ్యాపార సమాఖ్య అధ్యక్షుడు వంకదారి వీరభద్రయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన పెన్షనర్స్

ఆరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నంద్యాల వరదరాజులరెడ్డిని స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెన్నారెడ్డి, సెక్రటరీ వెంకటయ్య యాదవ్, ట్రెజరర్ దొడ్ల లక్ష్మన్న, ప్రముఖ నేత్ర వైద్యుడు రామమునిరెడ్డి, రిటైర్డు లెక్చరర్ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

55 ఏళ్లకుపైగా వైద్య సేవలు



కంటివైద్య నిపుణుడు డాక్టర్ వైవీ రామమునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ప్రముఖ కంటివైద్య నిపుణుడు డాక్టర్ వైవీ రామమునిరెడ్డి 55 ఏళ్లకుపైగా వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన రామమునిరెడ్డి 1938లో వెంకటసుబ్బమ్మ, చిన్న వెంకటసుబ్బారెడ్డి దంపతులకు జన్మించారు. 1966లో కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసుకున్న రామమునిరెడ్డి తొలుత రాజుపాళెం పీహెచ్‌సీలో పనిచేశారు. అనంతరం ప్రొద్దుటూరు పట్టణంలో స్థిరపడి కంటి వైద్య నిపుణులుగా సేవలు అందిస్తూ వస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు ఆయన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇదే ఆస్పత్రి ప్రాంగణంలో ఆయన కుమారుడు డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి కంటి వైద్య సేవలు అందిస్తున్నారు. వీరి కుటుంబానికి సంబంధించి మొత్తం 20 మంది వైద్యులుగా ఉన్నారు. ఈయన సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రశంసలు పొందారు.

హిందూ ధర్మం ఎంతో గొప్పది



మాట్లాడుతున్న సంతోష్ కుమార్ శాస్త్రి

ప్రొద్దుటూరు కల్చరల్ : హిందూ ధర్మం ఎంతో గొప్పదని, ప్రపంచ శాంతికి మూలం హిందూధర్మమే అని శృంగేరి శారదాపీఠం ఆస్థాన పండితుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పేర్కొన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం నృసింహ వైభవం– ప్రహ్లాద చరిత్రపై ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మం భారతదేశంలో సుస్థిరంగా ఉన్నంతకాలం ఈ ప్రపంచం బాగుంటుందన్నారు. ఎలా పుట్టాలో రామాయణం చెబుతుంది, ఎలా ధర్మబద్ధంగా బతకాలో భారతం తెలియచేస్తుందని, ప్రశాంతంగా ఎలా మరణించాలో భాగవతం వివరిస్తుందని ఈ గ్రంథాల ప్రాముఖ్యతను వివరించారు. సృష్టికి మూలం భగవంతుడే అని, నిజమైన భారతీయ యువకుడు ఎలా ఉండాలో ప్రహ్లాదుని పాత్ర ద్వారా వ్యాసుడు మనకు అందించారన్నారు. అనంతరం సంతోష్ కుమార్ శాస్త్రిని ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, ఆర్యవైశ్యసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం శిక్షణా తరగతులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శివకుమార్

బద్వేలు అర్బన్ : జూలై 1, 2 తేదీల్లో కడప నగరంలో జరగనున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ కోరారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కందారపు మురళి, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఎం బద్వేలు రూరల్ కన్వీనర్ వెంకటేష్, రూరల్ నాయకులు రమణ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డయేరియా వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు



రాచాయపేటలో తాగునీటి పథకం వద్ద లీకేజీని పరిశీలిస్తున్న వైద్య బృందం

గోపవరం : మండలంలోని రాచాయపేటలో డయేరియా వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 'రాచాయపేటలో డయేరియా' అనే శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మండల వైద్యాధికారులు మహేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణలు వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి డయేరియా వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందించారు. అలాగే తాగునీటికి ఉపయోగించే ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకుల వద్ద లీకేజీలను గుర్తించి బ్లీచింగ్ చల్లించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎస్సీకాలనీలో ఉన్న రెండు ట్యాంకులను పారిశుధ్య సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. ఇకమీదట ప్రతి మూడు నెలలకొకసారి తాగునీటి పథకాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గౌస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్‌లకు ఆర్థిక సాయం



మెకానిక్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఇరువురు మెకానిక్‌లకు ఆర్థిక సాయం అందజేశారు. మైదుకూరు రోడ్డులోని టూ వీలర్ మెకానిక్ రజాక్ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రొద్దుటూరు టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయూబ్, వైస్ ప్రెసిడెంట్ గాలి శివతో పాటు సభ్యులు ఆదివారం రజాక్‌ను పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చులకు రూ. 25,500 నగదు అందజేశారు. అలాగే సినీహబ్ సమీపంలోని మెకానిక్ షాపు నిర్వహిస్తున్న మడూరు బాషాకు చెందిన బంక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో పూర్తిగా దెబ్బతింది. అసోసియేషన్ సభ్యులు అక్కడికి చేరుకొని బాధితుడికి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి రమణ, ట్రెజరర్ ఫరూక్, గోపాల్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కటకటలోనూ నీటి వృథా

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీకి తాగునీరు అందించే బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో నీరు అడుగంటిపోవడంతో ప్రస్తుతం పట్టణంలో తాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విపత్కర సమయంలో ప్రతి నీటిబొట్టును వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవాల్సిండగా ... అందుకు భిన్నంగా తాగునీరు వృథా అవుతుండటం ఆందోళన కలిగించే పరిణామంగా మారింది. పట్టణంలోని శివానగర్ సమీపంలోని చపాతి గ్రౌండ్ నుంచి సుందరయ్యకాలనీ, పుల్లారెడ్డినగర్‌కు వెళ్లే కూడలిలో గత మూడు రోజులుగా బృహత్తర తాగునీటి పథకం పైపులైను లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా రోడ్లపైకి ప్రవహిస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా పైపులైను లీకేజీకి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

రైతులు ఐక్యతగా ఉండాలి



మాట్లాడుతున్న బీకేఎస్ రాష్ట్ర ఇన్‌చార్జి కొండబాబు

రాజుపాళెం : రైతులంతా ఐక్యతగా ఉంటే దేనినైనా సాధించవచ్చని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఇన్‌చార్జి కొండబాబు అన్నారు. మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని సీతారాముల కల్యాణ మండలంలో ఆదివారం సాయంత్రం బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి అధ్యక్షతన పొగాకు పంటపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులపై చాలా మంది ఆధారపడి బాగుపడ్డారని, కానీ రైతులు బాగుపడిన దాఖలాలు లేవన్నారు. రైతులు కూడా సేంద్రియ వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రకాశం జిల్లా బీకేఎస్ జిల్లా కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ ఏడాదికోసారి రైతులు పంట మార్పిడి చేయాలని చెప్పారు. పొగాకు పంట సాగు చేయడం వల్ల లాభసాటిగానే ఉంటుందని జమ్మలమడుగు, కర్నూలు జిల్లాలకు చెందిన పలువురు రైతులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ భాస్కర్, బీకేఎస్ కోశాధికారి సుబ్బిరెడ్డి, మండల కార్యదర్శి తులసీశ్వరరెడ్డి, గోపాయపల్లె వెంకటేశ్వరరెడ్డి, కొట్టాల రంగారెడ్డి, 120 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. త్వరలో ప్రతిభ బయోటిక్ రాజశేఖర రెడ్డితో భూసార పరిరక్షణ, పంటలు పండించడంలో మెలకువలు తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి తెలిపారు.

నేడు దస్తగిరి సాహెబ్ శతజయంతి, పుస్తకావిష్కరణ సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లిలోని ఎస్‌బీ మెమోరియల్ హైస్కూల్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు ఎస్‌డీఎస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నాయకుడు ఎస్.దస్తగిరిసాహెబ్ శతజయంతి ఉత్సవం నిర్వహించనున్నారు. డాక్టర్ పోలవరపు శంకరయ్య నాయుడు రచించిన సుందరకాండ విశ్లేషణం పుస్తకావిష్కరణ, ఎస్‌బీ అండ్ ఎస్‌డీఎస్, ఎస్ఎంహెచ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పొందిన 40 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందించనున్నారు. ఈ కార్యక్రమంలో అవధాని నరాల రామారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, విశ్రాంత జడ్జి ఎస్ఎం ఇస్మాయిల్, విశ్రాంత తెలుగు పండితులు ఏసీ దస్తగిరి, రచయిత ఖలందర్ పాల్గొంటారని ఎస్‌బీ మెమోరియల్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్.అహ్మద్‌హుసేన్ తెలిపారు. కార్యక్రమంలో సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.